క్లుప్తంగా

పీహెచ్‌సీ సందర్శన



మహాముత్తారం: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని స్టేట్ శాంపిల్ సర్వే యూనిట్ అధికారులు డాక్టర్ సంతోషలతా సోమవారం సందర్శించారు. మండలంలో గుర్తించిన లెప్రసీ కేసుల వివరాలను వైద్యసిబ్బంది, ఆశ వర్కర్లను అడిగితెలుసుకున్నారు. అనంతరం వైద్యసిబ్బందికి వాటిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సందీప్, మల్లయ్య, సీహెచ్ఓ విద్యాసాగర్, ఏపీఎంఓకే లూర్దమ్మ, అరుణ, లోకేందర్, నర్సింహారెడ్డి, కోమల, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు తదితరులు ఉన్నారు.

వీహెచ్‌పీఎస్ మండల అధ్యక్షుడిగా రమేష్



మహదేవపూర్: దివ్యాంగుల హక్కుల పోరాటసమితి మండల అధ్యక్షుడిగా దుర్గం రమేష్‌ను ఎన్నుకున్నటు జిల్లా అధ్యక్షుడు మాచర్ల వంశీకృష్ణ గౌడ్ తెలిపారు. మండల కేంద్రంలోని సోమవారం ఆ సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వంశీకృష్ణ గౌడ్ కమిటీ వివరాలు వెల్లడించారు. ఉపాధ్యక్షుడిగా మాడిగా రాజు, ప్రధాన కార్యదర్శిగా చేకుర్తి రాజబాబులను ఎన్నుకున్నట్లు తెలిపారు. జిల్లా ఉపాధ్యక్షుడు దుర్గం శంకరయ్య, కాటారం మండల అధ్యక్షుడు గోగు రవీందర్, ఎమ్మార్పీఎస్ మండల కన్వీనర్ బెల్లంపల్లి సురేష్, రవితేజ పాల్గొన్నారు.

గీత కార్మికుడికి గాయాలు



చిట్యాల: తాటి చెట్టు పైనుంచి ప్రమాదవశాత్తు కాలు జారి కింద పడడంతో ఓ గీత కార్మికుడికి గాయాలైన సంఘటన మండల కేంద్రంలో సోమవారం చోటుచేసుకుంది. సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. చిట్యాలకు చెందిన గుర్రపు గట్టయ్య సోమవారం ఉదయం వృత్తిలో భాగంగా తాటి చెట్టు ఎక్కి దిగుతుండగా కాలు జారి కింద పడ్డాడు. దీంతో తీవ్ర గాయాలు కావడంతో తోటి గీత కార్మికులు చూసి గట్టయ్యను స్థానిక సివిల్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అతని నడుముకు, పక్కటేముకలకు తీవ్ర గాయాలు కావడంతో వరంగల్‌లోని ఓ ప్రవేటు ఆస్పత్రికి తరలించారు. అతడి పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తరలించినట్లు అతని కుటుంబ సభ్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ మధుసూదనాచారి నిమ్స్ ఆస్పత్రిలో బాధితుడిని పరామర్శించారు.

పోలీసుల దాడులు

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని గుడుంబా స్థావరాలపై దాడులు నిర్వహించినట్లు ఎక్సైజ్ సీఐ అశోక్ సోమవారం తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని 8వ వార్డు సమీపంలో గాడిచర్ల పీరయ్య, గాడిచర్ల నారాయణ అనే ఇద్దరు వ్యక్తుల ఇంటి సమీపంలో దాడులు నిర్వహించినట్లు తెలిపారు. ఈదాడుల్లో 20 లీటర్ల గుడుంబా, 1200 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేసినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు వారిపై కేసు నమోదు చేశామన్నారు. హెడ్ కానిస్టేబుల్ సందీప్, నవీన్, తిరుపతి, నాగరాజు, శ్రీను పాల్గొన్నారు.

రైతులకు పట్టాలివ్వాలి

ఏటూరునాగారం: పోడు భూములు సాగు చేసుకుంటున్న రైతులకు పట్టాలివ్వాలని ఆదివాసీ విద్యార్థి సంక్షేమ పరిషత్ మహిళా జిల్లా అధ్యక్షురాలు కొప్పుల సరిత అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఐటీడీఏ కార్యాలయం వద్ద ఆమె మాట్లాడారు. ఏజెన్సీ ప్రాంతాల్లోని ఆదివాసీల పోడు భూములకు హక్కు పత్రాలు ఇవ్వకుండా ప్రభుత్వం మోసం చేస్తున్నా రన్నారు. మంగపేట మండలం పూరేడుపల్లి చెందిన గిరిజనులకు పోడు భూములు రావాలని ఆందోళన చేస్తున్నప్పటికీ రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదని వాపోయారు.

శరవేగంగా భూపాలపల్లి అభివృద్ధి

● ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

భూపాలపల్లి: నాడు కుగ్రామంగా ఉన్న భూపాలపల్లి, నేడు సింగరేణి గనులతో పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతూ రాష్ట్రంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న జిల్లాగా నిలిచిందని ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలో రూ.2.06కోట్లతో నిర్మించిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్, రూ.1.40కోట్లతో నిర్మించిన హోంలెస్ సెంటర్(నిరాశ్రయుల ఆశ్రయ కేంద్రం) భవనాలను సోమవారం అదనపు కలెక్టర్ టీఎస్ దివాకరతో కలిసి ప్రారంభించారు. అనంతరం కూరగాయల మార్కెట్ ఆవరణలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే గండ్ర మాట్లాడుతూ.. ప్రజలు, వ్యాపారుల సౌకర్యార్థం భూపాలపల్లి నడిబొడ్డున చేపలు, చికెన్, మటన్, కూరగాయలతో కూడిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను ప్రారంభించుకోవడం సంతోషం కలిగించిందన్నారు. కొన్ని రాజకీయ పార్టీల నాయకులు భూపాలపల్లిలో ఏం అభివృద్ధి జరిగిందంటూ ఆరోపణలు చేస్తున్నారన్నారు. అది వారి విజ్ఞతకే వదిలేస్తున్నానని అన్నారు. సింగరేణి సంస్థ వేయి క్వార్టర్లు నిర్మించిందని, అవి సరిపోవడం లేదనే విషయాన్ని సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి మరో వేయి క్వార్టర్లు మంజూరు చేయించి ఇటీవలే మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా ప్రారంభించుకున్నట్లు తెలిపారు. భూపాలపల్లి పట్టణంలో నలు దిక్కులా అభివృద్ధి చెందాలనే ఉద్దేశంతో మంజూర్ నగర్‌లో కూడా రూ.4.50 కోట్లతో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ భవన నిర్మాణ పనులు ప్రారంభించినట్లు తెలిపారు. ఇక నుంచి రోడ్లపై కూరగాయలు విక్రయించకుండా చూడాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. కూరగా యల మార్కెట్‌లో గతంలో అగ్ని ప్రమాదం జరిగిందని, అది ఎవరైనా కావాలని ఉద్దేశపూర్వకంగా చేశారా అనేది నేటికీ తేలలేదన్నారు. ఇటీవల విద్యుత్ వైరు చోరీ జరిగిందని, మరోమారు ఇలాంటి ఘటనలు జరగకుండా మున్సిపాలిటీ ఆధ్వర్యంలో నైట్ వాచ్‌మెన్‌ను ఏర్పాటు చేయాలని, పోలీసులు కూడా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం అదనపు కలెక్టర్ దివాకర మాట్లాడుతూ.. భూపాలపల్లి పట్టణం అభివృద్ధికి సంకేతం అన్నారు. రాష్ట్రంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న పట్టణాల్లో భూపాలపల్లి మూడవ స్థానంలో ఉందన్నారు. తాను 14 నెలల క్రితం ఇక్కడికి అదనపు కలెక్టర్‌గా వచ్చానని, అప్పటికి, ఇప్పటికీ చాలా అభివృద్ధి జరిగిందన్నారు. మున్సిపాలిటీ చైర్‌పర్సన్ వెంకటరాణి, వైస్‌చైర్మన్ హరిబాబు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రమేష్, పీఏసీఎస్ చైర్మన్ మేకల సంపత్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ అవినాష్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జనార్దన్, నాయకులు, కౌన్సిలర్లు మమత, మురళి, రాజు, ముంజాల రవీందర్, నారాయణ పాల్గొన్నారు.

డెలివరీల సంఖ్య పెంచాలి



వైద్యారోగ్యశాఖ అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ భవేష్‌మిశ్రా

భూపాలపల్లి అర్బన్: జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రతి నెలా డెలివరీలు 200లకు తగ్గకుండా చేయాలని కలెక్టర్ వైద్యారోగ్యశాఖ అధికారులు, డాక్టర్లను ఆదేశించారు. జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో సోమవారం కలెక్టర్ భవేష్‌మిశ్రా జిల్లా వైద్యారోగ్యశాఖ, వైద్యవిధాన పరిషత్ అధికారులతో డెలివరీలు, శిశువుల ఆరోగ్యంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలో గర్భిణుల నమోదు, వారికి అందిస్తున్న సేవలపై పీహెచ్‌సీల వారీగా సమీక్షించారు. నాలుగు విడతలుగా గర్భిణులకు ఇచ్చే టీకాలను 100శాతం ఇవ్వాలని ఆదేశించారు. ఆపరేషన్లు తగ్గించి సాధారణ డెలివరీలు చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. సాధారణ డెలివరీలనే ప్రోత్సహించాలని సూచించారు. జిల్లా ఆస్పత్రిలో ప్రతినెలా తప్పనిసరిగా 200డెలివరీలు జరగాలని చెప్పారు. జిల్లా ఆస్పత్రికి ఈ నెలలో నూతన అంబులెన్స్ వస్తుందని చెప్పారు. వచ్చే నెలలో పీహెచ్‌సీలలో డెలివరీల సంఖ్య పెరగాలని డీఎంహెచ్‌ఓను ఆదేశించారు. అన్ని రకాల సేవలను ప్రజలకు అందిస్తూ జిల్లాను ముందుంచాలని సూచించారు. డీఎంహెచ్‌ఓ డాక్టర్ శ్రీరామ్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓలు డాక్టర్ కొమురయ్య, డాక్టర్ శ్రీదేవి, జిల్లా ఆస్పత్రి వైద్యులు, పీహెచ్‌సీ వైద్యాధికారులు పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోవాలి

కాటారం: మండల కేంద్రంలోని గిరిజన గురుకుల బాలుర, బాలికల పాఠశాల, కళాశాలల్లో ఖాళీగా ఉన్న ఏఎన్ఎం, స్టాఫ్‌నర్స్ పోస్టులను ఔట్‌సోర్సింగ్ ప్రతిపాదికన భర్తీ చేయనున్నట్లు గురుకులం రీజినల్ కోఆర్డినేటర్ ఏ.వి.రాజ్యలక్ష్మి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బాలుర కళాశాలలో ఏఎన్ఎం, బాలికల కళాశాలలో స్టాఫ్ నర్స్ పోస్టు ఖాళీగా ఉన్నట్లు పేర్కొన్నారు. జిల్లాలోని ఎస్టీ అభ్యర్థినులై, ఏఎన్ఎం పోస్టుకు ఎసెస్సీ, ఏడాదిన్నర ట్రైనింగ్ కోర్సు, స్టాఫ్‌నర్స్ పోస్టుకు బీఎస్సీ నర్సింగ్, ఇంటర్ పాసై మూడున్నర సంవత్సరాల నర్సింగ్ కోర్సు పూర్తి చేసి ఉండాలని తెలిపారు. ఈ నెల 14 నుంచి 21 వరకు మహబూబాబాద్‌లోని ఆర్సీ కార్యాలయం నందు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మెరిట్ ప్రతిపాదికన నియామకాలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు.

ప్రతీ కూలీకి పని కల్పించాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ శంకర్‌నాయక్

కాటారం: ఉపాధిహామీ పథకం ద్వారా అడిగిన ప్రతీ కూలీకి పని కల్పించేలా అధికారులు, సిబ్బంది చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ శంకర్‌నాయక్ సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఉపాధిహామీ టెక్నికల్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, గ్రామ పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో ఉపాధిహామీ పనుల వివరాలు, కూలీల సంఖ్య, వేతనాల చెల్లింపు, కూలీల బ్యాంక్ ఖాతాలకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఉపాధి పనుల నిర్వహణపై పలు సలహాలు చేశారు. మిషన్ అంత్యోదయ ఆన్‌లైన్ యాప్ ద్వారా సర్వే కార్యక్రమంపై పంచాయతీ కార్యదర్శులకు సూచనలు చేశారు. హరితహారం మొక్కలకు నీరు అందజేత, నర్సరీల పెంపకంపై సమీక్షించారు. ఈ సమావేశంలో ఎంపీఓ ఉపేంద్రయ్య, ఉపాధిహామీ టెక్నికల్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లు పాల్గొన్నారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ..



టేకుమట్ల: ఉపాధ్యాయులతో విద్యార్థులు

మొగుళ్లపల్లి: మండలంలోని పిడిసిల్ల గ్రామంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం స్వయం పరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ప్రధానోపాధ్యాయుడిగా బన్ని, ఉపాధ్యాయులుగా సింధూజ, మంజుభార్గవి, సుప్రియ, అభి, సంధ్య, సమనశ్రీ, స్ఫూర్తి, వ్యవహరించారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేసి చక్కగా బోధించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఎస్ఎంసీ చైర్మన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టేకుమట్ల: మండలంలోని వెలిశాల ఉన్నత పాఠశాలలో సోమవారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులే ఒక్క రోజు ఉపాధ్యాయులుగా విధులు నిర్వర్తించారు. మండల విద్యాధికారిగా లింగంపెల్లి సహస్ర, ప్రధానోపాధ్యాయులుగా కోస్న సహస్ర, వ్యాయామ ఉపాధ్యాయులుగా గీసరి అన్వేష్, ఉపాధ్యాయులుగా వైష్ణవి, కీర్తన, ఎండీ రియా, రుచిత, అమూల్య, జీవన్‌పాల్, వైష్ణవి, లక్ష్మన్, రిషీ, అంజలీ, రుత్విక్, తేజామృత, పవన్‌తేజ, రోహిత్‌లు విధులను నిర్వర్తించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రాం మధు, పాఠశాల డైరెక్టర్ నారాయణ, ఉపాధ్యాయులు రాజేశ్వరీ, సుమలత, చిరంజీవి, నితీషా, చైతన్య, నాగమణి పాల్గొన్నారు.

చిట్యాల: మండలంలోని ఒడితల గ్రామంలోని శ్రీవివేకనంద పబ్లిక్ స్కూల్‌లో సోమవారం ఘనంగా స్వయంపరిపాలన దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులే ఒక్క రోజు ఉపాధ్యాయులుగా బాధ్యతలు నిర్వర్తించారు. డీఈఓగా ఎండీ సన, ఎంఈఓగా జి. హారిక, హెచ్ఎంగా బి.కల్యాణి, పలువురు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కర్సండెంట్ సతీష్, డైరెక్టర్ ఉయ్యాల శ్రీధర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



చిట్యాల: ఒడితలలో..



మొగుళ్లపల్లి: పిడిసిల్లలో..

సాగునీరు అందించాలని వినతి



వినతిపత్రం అందిస్తున్న నాయకులు

ములుగు రూరల్: ములుగు మండలంలోని లక్నవరం లోతట్టు గ్రామాలైన కన్నాయిగూడెం, రాయినిగూడెం, పెగడపల్లి, సర్వాపూర్, అంకన్నగూడెం గ్రామాలకు సాగునీరు అందించాలని సీపీఎం మండల కార్యదర్శి ఎండీ అమ్జద్‌పాషా సోమవారం అదనపు కలెక్టర్ వైవి గణేష్‌కు వినతిపత్రం అందజేశారు. అమ్జద్‌పాషా మాట్లాడుతూ.. లోతట్టు గ్రామాల రైతుల సాగు భూములు వర్షాకాలంలో లక్నవరం ముంపునకు గురవుతున్నయని యాసంగి నీరు అందక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.

రైతు సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట



ప్రమాణస్వీకారం చేస్తున్న మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం

కాటారం: ప్రత్యేక రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం రైతు సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట వేస్తూ ముఖ్యమంత్రి కేసీఆర్ రైతు పక్షపాతి అని నిరూపించుకుంటున్నారని పెద్దపల్లి జెడ్పీ చైర్మన్ పుట్ట మధు అన్నారు. కాటారం వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం ప్రమాణం స్వీకరణ కార్యక్రమం సోమవారం మండల కేంద్రంలోని మార్కెట్ కమిటీ ఆవరణలో ఘనంగా నిర్వహించారు. పెద్దపల్లి జెడ్పీ చైర్మన్ పుట్ట మధు, భూపాలపల్లి జెడ్పీ చైర్‌పర్సన్ జక్కు శ్రీహర్షిణిరాకేశ్, వరంగల్ రూరల్ జెడ్పీ చైర్‌పర్సన్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి ప్రమాణస్వీకరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. నూతన చైర్‌పర్సన్ పెండ్యాల మమతమనోహర్, పాలకవర్గాన్ని శాలువాలతో సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా పుట్ట మధు మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని వర్గాల ప్రజలకు పదవుల్లో సముచిత స్థానం కల్పిస్తున్నామన్నారు. దీర్ఘకాలికంగా ఈ ప్రాంతాన్ని పాలించిన దుద్దిళ్ల కుటంబం ఏనాడు నాయకులు, కార్యకర్తలకు పదవులు ఇచ్చి ఉన్నతస్థానంలోకి తీసుకొచ్చింది లేదన్నారు. స్థానిక ఎమ్మెల్యే తన స్వలాభం, సంపాదన కోసం కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలను బలిపశువులను చేస్తున్నారని ఆరోపించారు. తమకు పదవులు ఉన్నా లేకున్నా ఈ ప్రాంత ప్రజలకు అండగా నిలుస్తున్నామని సేవ చేయడం కంటే ఏది ముఖ్యం కాదన్నారు. మంత్రిగా, ఎమ్మెల్యేగా శ్రీధర్‌బాబు అతడి సొంత గ్రామంలో చేసిన అభివృద్ధి ఏంటి, తాము, బీఆర్ఎస్ పార్టీ చేసిన అభివృద్ధి ఏంటో చర్చకు సిద్ధమా అని సవాలు విసిరారు. మార్కెట్ కమిటీ ద్వారా రైతులకు ఉత్తమమైన సేవలు అందించాలని, అభివృద్ధికి తమవంతు సాకారం అందిస్తామని గండ్ర జ్యోతి, జక్కు శ్రీహర్షిణి అన్నారు. అనంతరం పుట్ట మధు, జక్కు శ్రీహర్షినిరాకేశ్, గండ్ర జ్యోతి, నూతన చైర్‌పర్సన్ మమతమనోహర్‌ను పాలకవర్గ సభ్యులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు గజమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ యూత్ నాయకుడు జక్కు రాకేశ్, సర్పంచ్ తోట రాధమ్మ, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తోట జనార్దన్, మంథని జెడ్పీటీసీ తగరం సుమలత, ఎంపీపీలు రాణిబాయి, శంకర్, పీఏసీఎస్ చైర్మన్లు చల్ల నారాయణరెడ్డి, చల్ల తిరుపతయ్య, శాంతకుమార్, బీఆర్ఎస్ యూత్ డివిజన్ అధ్యక్షుడు భూపెల్లి రాజు, సబ్ డివిజన్ అధ్యక్షుడు నాయిని శ్రీనివాస్, రామిళ్ల కిరణ్, కుడుదుల రాజబాబు, అంకారి ప్రకాశ్, వైస్ చైర్మన్ రాధారపు స్వామి, కార్యదర్శి కనకశేఖర్ పాల్గొన్నారు.

మొల్లను స్ఫూర్తిగా తీసుకోవాలి



మొల్ల చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

మహదేవపూర్: మొల్లా జీవిత చరిత్రను స్ఫూర్తిగా తీసుకోవాలని సర్పంచ్ శ్రీపతిబాపు, శాలివాహన కుమ్మరి సంఘం నాయకుడు సముద్రాల తిరుపతి అన్నారు. మండల కేంద్రంలోని ఐబీ గెస్ట్ హౌస్‌లో తొలి తెలుగు కవయిత్రి మొల్ల జయంతి వేడుకలు సోమవారం నిర్వహించారు. కవయిత్రి మొల్ల చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా తిరుపతి మాట్లాడుతూ.. మన పూర్వీకుల చరిత్రలు నేటి తరానికి స్ఫూర్తినిస్తాయని, శాలివాహన కుమ్మర సంఘం ఆధ్వర్యంలో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. కుమ్మర సంఘం కమ్యూనిటీ భవనం నిర్మించడానికి 10 గుంటలు స్థలం కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు. సర్పంచ్ మాట్లాడుతూ.. కవులు, రచయితలను సముచిత రీతిలో గౌరవించి, కుల సంఘాలను అన్ని రంగాల్లో తెలంగాణ సర్కారు ప్రోత్సహిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ డైరెక్టర్ వెన్నంపల్లి మహేష్, కుమ్మర సంఘం యువజన నాయకులు సందీప్, పంచాయతీ పారిశుద్ధ్య స్థాయి సంఘం కన్వీనర్ లింగాల రామయ్య, బీఆర్ఎస్ బీసీసెల్ మండల అధ్యక్షులు కారెంగుల బాపురావు, శ్రీ షిరిడీ సాయి బాబా దేవస్థాన చైర్మన్ మెరుగు లక్ష్మణ్, నాయకులు కేశవ రెడ్డి, శీలం లక్ష్మణ్, శంకర్ రావు, చీర్లవంచ రమేష్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కవిత జన్మదిన వేడుకలు



భూపాలపల్లి అర్బన్: కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే



భూపాలపల్లి: వేడుకల్లో పాల్గొన్న గండ్ర జ్యోతి

భూపాలపల్లి/భూపాలపల్లి అర్బన్/కాటారం/మహదేవపూర్: భారత జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత జన్మదిన వేడుకలను జిల్లా కేంద్రంలో, పలు మండల కేంద్రాల్లో సోమవారం ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్‌లో జాగృతి జిల్లా అధ్యక్షుడు మాడ హరీష్‌రెడ్డి ఆధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి హాజరై కేక్ కట్ చేశారు. అదేవిధంగా బీఆర్ఎస్ జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి హాజరయ్యారు. తెలంగాణ బొగ్గ గని కార్మిక సంఘం(టీబీజీకేఎస్) ఆధ్వర్యంలో ఏరియాలోని అన్ని గనుల్లో కార్మికుల మధ్య కవిత జన్మదిన వేడుకలను నిర్వహించారు. కాటారం మండల కేంద్రంలోని మార్కెట్ కమిటీ ఆవరణలో పెద్దపల్లి జెడ్పీ చైర్మన్ పుట్ట మధు, భూపాలపల్లి జెడ్పీ చైర్‌పర్సన్ శ్రీహర్షిణిరాకేశ్ కేక్ కట్ చేసి సంబురాలు నిర్వహించారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



చిట్యాల: పరామర్శిస్తున్న ఎమ్మెల్యే గండ్ర

చిట్యాల: మండలంలోని జూకల్ సర్పంచ్ పుట్టపాక మహేందర్ తండ్రి రాజయ్య ఇటీవల మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి సోమవారం పరామర్శించారు. మృతుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం చల్లగరిగలోని మాజీ ఎంపీటీసీ సభ్యురాలు బాలగోని శోభ అత్త బాలగోని వెంకటమ్మ అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. రత్నాకర్ రెడ్డి, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు ఆరెపల్లి మల్లయ్య, నాయకులు పిట్ట సురేష్ బాబు, గుర్రం మహేందర్, చాడ రవీందర్‌రెడ్డి, స్వామి దాసు, కొడారి రవి, రాజేందర్, మెరుగు సంపత్, ఆకుల సుధాకర్, రబ్బాని తదితరులు పాల్గొన్నారు.

టేకుమట్ల(రేగొండ): రేగొండ మండలంలోని నాగుర్లపల్లి, కనిపర్తి, జోగయ్యపల్లి, మడ్తపల్లి గ్రామాలకు చెందిన మోరె శాంతమ్మ, పడగంటి రాజు, సూర లక్ష్మీ, గొండె బాబురావు ఇటీవల మృతి చెందారు. దీంతో బాధిత కుటుంబాలను ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి సోమవారం పరామర్శించి, ఆర్థిక సాయం అందజేశారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అంకం రాజేందర్, ప్రతాప్‌రెడ్డి ఉన్నారు.

ములుగు రూరల్(గోవిందరావుపేట): గోవిందరావుపేట మండలం దుంపెల్లిగూడెం గ్రామానికి చెందిన బానోత్ సోమునాయక్ అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబ సభ్యులను గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ పోరిక గోవింద్‌నాయక్ సోమవారం పరామర్శించి మృతదేహం వద్ద నివాళులర్పించారు. ఎంపీపీ సూడి శ్రీనివాస్‌రెడ్డి, సాయికుమార్, వాణి రాజు, నరసింహ ఉన్నారు.

ఎన్ఎంఎంఎస్‌కు విద్యార్థుల ఎంపిక



నైన్‌పాకలో విద్యార్థులకు ఉపకార వేతనాలు అందజేస్తున్న ఉపాధ్యాయులు



ఆదర్శ పాఠశాలలో..

చిట్యాల: నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్‌నకు మండలంలోని నైన్‌పాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న ముగ్గురు విద్యార్థులు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు మాడిశెట్టి సుధాకర్ సోమవారం తెలిపారు. 8వ తరగతి చదువుతున్న పాలడుగుల అజయ్, గొడుగు శృతిక, మహమ్మద్ సమీరా ఎంపికయ్యారని పేర్కొన్నారు. విద్యార్థులకు ఇంటర్మీడియట్ పూర్తి అయ్యే వరకు సంవత్సరానికి రూ.12000 ఉపకార వేతనాలు అందనున్నట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థులను, ఇందుకు కృషిచేసిన గైడ్ ఉపాధ్యాయులు స్వాతి, శ్రీధర్‌లను పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సీఆర్పీలు తిరుపతి, నరేష్, గ్రామస్తులు అభినందించారు.

మోడల్‌స్కూల్‌లో..

నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్‌నకు మోడల్ స్కూల్ నుంచి విద్యార్థులు బొజ్జం నిహారిక, కేసరా కీర్తి, నాగిరెడ్డి, అద్విత, శ్రీ చందర్ ఎంపికయ్యారు. ఎంపికైనా విద్యార్థులను, వారికి సహకరించిన ఉపాధ్యాయుడు నాగేశ్వర్‌రావును పాఠశాల ప్రిన్సిపాల్ కొంరాంబత్తిని శేఖర్ అభినందించారు.

సర్టిఫికెట్లు అందజేత



సర్టిఫికెట్లను ఇస్తున్న ఎంపీపీ మల్హల్‌రావు

మల్హర్: మండలంలోని చిన్న తూండ్ల గ్రామంలో నాబార్డ్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఉచిత కుట్టు శిక్షణ కేంద్రంలో శిక్షణ పొందిన మహిళలకు ఎంపీపీ చింతలపల్లి మల్హల్ రావు సోమవారం సర్టిఫికెట్లను అందజేశారు. కుట్టు శిక్షణ కేంద్రంలో గత నెలరోజుల పాటు మహిళలకు ఉచితంగా శిక్షణ నిర్వహించి, సర్టిఫికెట్‌తో పాటు స్టైఫండ్ అందించారు. ఈ కార్యక్రమంలో నాబార్డ్ డీడీఎం రవి చైతన్య, సర్పంచ్ పులిగంటి మమత, వెలుగురేఖ గ్రామీణాభివృద్ధి సంస్థ సీఈఓ రజిత, ఉపసర్పంచ్ బొబ్బిలి సురేష్, కార్యదర్శి సమ్మరాజు తదితరులు పాల్గొన్నారు.